ఆ మునిమాపువేళ - మాటుమణిగిన వేళ.

పాటూపోటూలేక అష్టమి ఘడియల సముద్రం మందగొడిగా, మేలుకుంటున్న కొండచిలువలా కదలికలేక, నిండుకున్న కోనేరులా తపతపలాడుతోంది. మినుకు మినుకుమని ఎర్రబారిన అక్కడా ఇక్కడా చుక్కలతో, మబ్బుమరకేనాలేని ఆకాశం నీలపుటద్దంలా నిర్మలంగావుంది. ఆకు అల్లాడంలేదు, చీమ చిటుక్కుమనడంలేదు. జరగబోయేది యెరిగిన మేధావిలా, పుట్టెరిగిన సాక్షిలా గడుసుగా, గుంభనంగా ప్రకృతి కులుకుతోంది.

పంజరం నోరుతెరచి పసిగను రుము కొస్తోంది. పంజరాన్ని ఒడుపుగా మింగే ద్దామని అదనుకోసం మాటేసుకు కాచుకుంటోంది సొరచేప.

"హలో....ఎస్... రామనాధం స్పీకింగ్ హలో హలో.... ఎవరూ!.... ఓహో.... తమరా! చంద్రశేఖరంగారా!...నమస్కారం సార్.... యిందాక తమకోసం ఆఫీసు కొచ్చేను సార్.... తమరూ.... కోరాడ బ్రిడ్జి యినస్పెక్షన్‌కి వెళ్ళేరంటే.. రేపు దర్శనం చేసుకుందామని.. వచ్చేశాను....రమ్మని సెలవా!"


"నోనో....మంచిపని చేసేరు... అను కోకుండా తగిలిందండీ జిడ్డు యినస్పెక్షనూ ....అయామ్ సారీ రామనాధంగారూ.... మిమ్మల్ని డిసెపాయింటు చేసేను ..మీ బిల్లు పూర్తిగా పాసైపోయింది.. రేపు తీసుకుని మహారాజులా కేష్ చేసుకోండి"

"థేంక్స్....అంతా తమ చలువ.... మీరే ఒక చూపు చూడకపోతే....మీ కానియరు యింజనీరు గండరగండడు ...ఆ బిల్లు పాసయ్యేసరికి ముచ్చెరువుల నీళ్ళు తాగుండేవాణ్ణి."

"ఎంత మాటా .... ఏదో సెక్రతరహాగా మాటవరస కంటారుగాని.... మీ చలవ మాత్రం లేదుటండీ!"

"ఎక్కడ దర్శనం చేసుకోమంని సెలవు!"

"రేపు అప్సరాలో మినిస్టరుగారి డిన్నరుకి వస్తున్నారా!"



"ఓయస్....ఎందుకురానూ!"

"మరింకేం.... అక్కడే.... అవును గానీ....యీ గొడవలోపడి మరిచిపోయేను- ఆటంబాంబులాంటి అమాకీ తీసేరు రామనాధంగారూ....దొంగసొత్తుతోసహా ఎ.ఎ. స్వామి దొరికిపోయేడు— జైల్లో వున్నాడు- కోర్టు బెయిలివ్వలేదు....వాడికి ఆ హార్బరు కాంట్రాక్టు కూడా గోవిందా....మరి అది కూడా మీకే ఖాయం.... మంచి డిన్నరివ్వాలి రామనాధంగారూ...."

"ఓస్.... దానికేంవుందండీ.... తమరి దయుండాలిగానీ"

"అంతా వాడిదయ.... నాదేంవుందండీ- రేపు డిన్నర్లో కలుసుకుంటున్నాం సుమండీ మరిచిపోకండేం....గుడ్‌నైట్"

ఓకే....గుడ్‌నైట్" అని "వెరీ వెరీ గుడ్‌నైట్" అనుకుంటూ ఫోను దించేసేరు రామనాధంగారు.

పాముల పుట్టలాంటి టేబిలు. తుట్టలు తుట్టలుగా చుట్టుకుపోయిపొర్లాడుతున్న ప్లానులు పక్కకి తోసేసి కొత్త బాక్సు సీలు విప్పి చెరూట్ చుట్టతీసి సంపెంగ పువ్వో మల్లెపువ్వో అన్నట్టు ముక్కుదగ్గరుంచుకుని నిండుగా వూపిరి పీల్చుకుని ముట్టించేరు. పెనంలో దోరగా వేగుతున్న కందిపప్పులా కమ్మకమ్మగా గదంతా ఆవరించి ఆయన తలలో ఆలోచనలలాగ చుట్టపొగను సిరంగుసుళ్ళు తిరుగుతోంది.

"కాసీకి గతిలేక నా కిందనిన్న మొన్నటిదాకా గంప నెత్తికెత్తుకుని....యిసకాయిటికా మోసి....నా మోచేతికింద నీళ్ళు తాగి బతికిన రోజు కూలీ అప్పలస్వామిగాడు.... వేలు చూపిస్తే మండదాకా మింగేసి మేస్త్రీ అయిన అప్పలస్వామిగాడు.... పోనీకదా కూలివెధవ అని జాలిదలిచి చూసీ చూడనట్టూరుకుంటే మేడ మిద్దే సంపాయించి, తలపాగాచుట్టి మోటారు సైకిలెక్కి యివాళ పెద్ద కంట్రాక్టరయిపోతాడా .... అరికపాటి అప్పలస్వామిగాడు ఎ. ఎ. స్వామి అయిపోతాడేం!.... అయిపోతాడయిపోతాడు.... అయితే అయ్యేడు....పోనీ యింతకీ ఎంత మంది బాగుపడడంలేదూ ...మనవాడే.... చేతికిందవాడు చేదోడు వాదోడుగా వుంటాడనుకుంటే....నాకే సొడ్డెట్టబోతున్నాడే వీడూ!.... రామనాధం బాబుగారు

ఆ హార్బరు కాంట్రాక్టుకోసం ఎంత కిందా మీదా పడిపోయి తాపత్రయ పడతున్నారు. అడ్డు తగలడం ధర్మంకాదు.... గుండదు. తిన్నయింటికే వాసాలు లెక్కెడతావా. అన్న బుద్ధీ జ్ఞానం వుందా వాడికి తక్కువ బుద్ధి వెధవలు.... నా డబ్బుతో నే అప్ప రాలో బీరూగీరు వూరకుక్కలాగ నాకి చప్పరించి లొట్టలేసి... మర్నాడే ఆ కక్కుర్తి వెధవల్ని మళ్ళీ న్ అండ్ పీలో తప్పతాగించి.... ఆ కాంట్రాక్టు నాకు దక్కకుండా బోల్తాకొట్టి చేద్దామను కున్నాడా!.... ఇవాళా నిన్నానా అప్పుడే చాలారోజులనుంచీ చూస్తునాను వీడి వాలకం.... ఆయిలు కంపినీ వనపరేకులు దొడ్డిదారిన నడిపించీడానికి పరపతిని వుపయోగించుకుని. ఫిఫ్టీ, ఫిఫ్టీ, అని బేరం పెటీలు చేసుకుని, నా లాంటే వాడు కువి చివరికి మొండిచెయ్యి చూపిస్తాడా!.... లారీ అద్దె వుంపించండి అంటూ వెయ్యి రూపాయలు.... ముష్టి వెయ్యి రూపాయలు దిగదీసిపడేసి నాకే టోకరాయిస్తాడావీడు?– ఎంతవాడైపోయేడూ! వాడి గుట్టూ మట్టూ, పంచప్రాణాలూ అన్నీ మన చేతిలో వున్నాయవి మరిచిపోయేవు దొంగ రాస్కెల్.... మంచిపనైంది వెధవన్నకి– ఎంత చేసుకున్నవాడికి అంతంత మహా దేవా అన్నారు.... పాశుపతాస్త్ర లాంటివాడు చంద్రశేఖరం.... ప్రయోగించాం– అంతే జైల్లో వున్నారు– ఏ.ఏ. స్వామిగారు– అయినా వీళ్ళనీ వాళ్ళనీ అనుకొనేంలాభం! దొరగాళ్ళు వెళిపోతే మనవాళ్ళేదో వుద్ధ రించేస్తారనుకున్నాం.... యిల్లు కప్పు టల్లల్ల లాగ వాటాలు కావాలంటూ కత్తిమీదెక్కి పిండి దంచుకున్నారు వీళ్ళు... తాతలనాటి సుక్షేత్రాలు తాకట్లు పెట్టేసి, పుల్లాపుడకా చీపీ నెత్తుమా కూడా ధారబోసి స్వరాజ్యం స్వరాజ్యం అంటూ పెర్రివెధవల్లాగ తైతక్కలాడి, వుప్పు పట్టుకుపట్టి తెగ తిరిగేం .... దమ్ములెక్కిపోతున్నా బొత్తు కద్దరు గుడ్డలు కట్టుకుని బికారి వెధవల్లాగ జోలి పట్టుకుని వీధుల్లో పడ్డాం .... ఈ అవస్తలన్నీ ఎందుకు పడ్డాం? .... రోజులు మారవా, మన రోజులు బాగు పడవా అవి.... మారేయి మారేయి .... ఆ అలు రాని దద్దయ్యలందరూ గద్దె

లెక్కేక్కేరు ...గోచిపాత రాయుళ్ళంతా ములు కర్రలు పట్టుకుని పెప్పెప్పె .... ఎహ్హె హెహెయ్ అంటూ మా లాంటి వాళ్ళని గొడ్లు తోలినట్లు తోలుతున్నారు. ఇంజనీర్లూ కంట్రాక్టర్లూ అంతా వాళ్ళే.... ఒక్క పోలి కాపు, ఒక్క మేస్త్రిగాడు మాట వినడు గదా ...అంతా మోతుబర్లే మరి.... అయినా యీ కిస్తీల తక్కెడ మేళాలు ఎంత కాలంలే... రోజులు మారవా! .... అంతా తారుమారైపోయింది.... ధర్మం మోకాళ్ళ చిప్పలు విరిగి మూలబడిపోయింది .... పాపం మునిగిపోతోంది. ధర్మం నిల బడదా. న్యాయం జయిండదా! .... ఇంకెంత కాలం ఎంతకాలం? కొల్లేరొచ్చి కొట్టుకు



ర చ యి త

పోదా? ...భూమి దద్దరిల్లదా? నడిమంత్రం సిరిగాళ్ళని ... అప్పలస్వామిగాళ్ళని భూదేవి మింగేస్తుంది .... ఎన్నాళ్ళు సాగుతుందిరా నీ మోసం అప్పలస్వామీ! నీ ఆటకట్టు...! ఒరే! మిష్టర్ ఎ. ఎ. స్వామి! పెద్దాళ్ళతో పరాశికా లాడతావా బ్లడీఫూల్! ఇవాళతో నీ చాప్టర్ క్లోజ్ .... అప్పలస్వామిగాడు క్లోజ్....భూదేవి కంపించాలి .... ధర్మం జయించాలి" అని ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ సగం సగం కాలిన చెరూట్ చుట్టను ఏష్ట్రేలో ముక్కు పట్టుకుని ముంచి కసిగా నలిపి పారేసి, గాడ్రెజ్ కుర్చీమీద ఒక్కమారు గిర్రున తిరిగి భోజ నానికి లేవబోయేరు రామనాథంగారు.

పక్కనెక్కడో పసిపాప కేవ్వుమని గుక్క పెట్టింది. మరుగెత్తిన చమురు జిలజిలలా, దట్టంగా పెరిగిన సరుగుడు తోటలో దారిలేక చిక్కుకున్న యీదురు గాలి రొదలా .... జింయ్ జింయ్ హోరు హోరుమని దూరాన్నుంచి శబ్దం సమీ పిస్తోంది. ఒళ్ళు జలదరించింది, కుర్చీ వణికినట్టనిపించింది రామనాథంగారికి.

"ఉండరా తాతా.... అంత వాడివేలే.... హమ్మభడవా! తాతకే దగ్గులు నేర్పు తావూ!.... నన్ను బోల్తా కొట్టించేద్దామనే? వేలెడు లేవారే!...." అంటూ మనవడు కుర్చీని కుదుపుతున్నాడనుకున, వెనుదిరిగి లేచి పట్టుకోబోయేరు. ఎవరూ కనబడక నిర్ఘాంతపోయేరు రామనాథంగారు.

□ ● □

అదేవేళ

"కొంపా గోడూ అమ్మిపారేసేనా .... తల తాకట్టు పెట్టేనా.... రేపు శ్రావణంలో ముడెట్టేదామనుకున్నాం.... ఎంతపనిజేసింది మాయదారిగుంట!.... హవ్వ హవ్వ!.... యింటావంటాలేదు.... తల కొట్టేసింది ముదనష్టపుముండ.... యిరుగూ పొరుగూ కాకుల్లా పొడుచుకు తినేస్తారు.... యింక నేనే సుయ్యో గొయ్యో చూసుకోవాలి.... మీకేంమీరు వీధిలోకి పోతారు.... యింట్లో మగ్గిచచ్చేదాన్ని నేనే.... ఎలా చావను!.... ఛీఛీ వెధవబతుకు" అని కక్కలేక మింగ లేక మొగుడిముందు కూర్చుని ముక్కు తోంది యిల్లాలు.

"కొంపా గోడూ అమ్మితేమాత్రం ఏం వొస్తుందే నీ వెర్రిగానీ.... గోచిపాత.... యిహ మిగిలింది నీ తలా నా తలానూ.... అంతేనా!.... వాటి పరువు నువ్వెరగందా నేనెరగందా!.... నెలాఖరున అవసరానికి రూపాయికి అయివేజులేదు.... కానీ పుట్టదు కదా" అంటూ పక్కకి ఒత్తిగిల్లేడు బడి పంతులు కామేశం.

"అందుకని కులం బెలం లేకుండా.... హవ్వ.... ఛీఛీ అంత పని చేస్తుందా?.... రామహరే!.... నా కడుపున చేడబుట్టింది గదండీ రాలుగాయి గుంటపాపా .... ఇంతకీ దాన్ననేం లాభంలెండి" అంటూ మెటికలు విరుచుకుంది.

"ఏవిఁటే నీ గొణుగుడు ... అబ్బ! ఒకటేనస."

"మీ రిచ్చిన అలుసే - ఆ దిక్కుమాలిన కాలేజీలూ చదువులూ లేనకెందుకండీ అంటే వినిపించుకున్నారా? తండ్రీ కూతుళ్ళిద్దరికీ ఒకటే వెఱ్ఱి ... బ్రహ్మ. వెఱ్ఱి... కూతురు దోసిళ్ళతో కాసులు గుమ్మరించి పోసేస్తుందని సంబడమేఁ కాని ముందూ వెనకా ఆలోచించారూ? .... అంత తెలివుంటే యింకనేం...హయ్యో రాత."

"నీ రాతకేవేఁ?"

"అవును నా రాతకేం?... నిక్షేపంలా వుంది....గుండ్రాయిలా మీరుండగా నాకేఁవండీ....హమ్మ! నా కొంపతీసింది శకాళీ గుంట!....ఇంతవరకూ వచ్చిఁ తరవాత యింక చంటిదాన్నెవడు చేసుకుంటాడండీ? ఎలా చచ్చేది?"

"అదేఁవిఁటేవ్ ! నీ కొంపతీసిందంటున్నావ్?....నాకు తెలీకుండ మరో కొంపెక్కడేనా జాగర్త పెట్టేవిఁటి.... చెప్పవె చెప్పు....అహఁ తెలీకడుగుతాను- చూడు చూడు....అలాంటి దేవైనావుంటే వెంటనే తాకట్టు పెట్టేసి చంటిదన్నికూడా సాగనంపేద్దాం"

"ఛీ వూరుకోండి....కడుపుమండి నేను చస్తోంటే....వేళాకోళానికి దిగేరు మహారాజు!.... యిదేం గుండె నిబ్బరమమ్మో మనిషికి!" అంటూ దవడలు నొక్కుకుంది యుల్లాలు.

పకుక్కమని నవ్వేడు కామేశం.

"అయ్యో అయ్యో....ఆ నవ్వేమిటండీ- వెఱ్ఱిబాగుల చూపులూ మీరూనూ ...బుఱ్ఱ పాడవలేదుకదా....హయ్యో దేవుడో"

"ఉష్! అరవకే....యిప్పటికి నీ దయ వల్ల యీ బుఱ్ఱ స్థిమితంగానే వుంది.... నువ్విలా యీరంగఁవేస్తే మాత్రం చెప్ప లేను....పిడికెడు బుఱ్ర.... ఎంతసేపు గిర్రన బొంగరంలా తిరిగిపోడానికి?"

"యిహ అదొక్కటే తక్కువ బతుక్కి.... యీచిత్తక్షోభలో ఈ గందరగోళం కూడానా మహప్రభో!... తండ్రీ నారాయణమూర్తీ! ఎన్ని పాట్లు పెడుతున్నావు నాయనా"

"కడుపుచించుకుంటే కాళ్ళమీన పడుతుందే వెఱ్ఱిదానా!"

"పడితే పడింది దౌర్భాగ్యురాలు!.... అంతపని చేసిపోతుందా!.... యింకా దాని మొహం చూడాలా?....పంచ మహాపాతకాలూ చుట్టుకుంటాయి"

"నీ మొహం.... అదేం కానిపని చేసిందే? మనసిచ్చింది. లక్షణంగా సింహాచలంలో పెళ్ళి చేసుకుంది."

"హూఁ!....మనం లేవుఁటండీ?....దీనికేనా వున్నాయి మనసూ మట్టి గడ్డలూను- అమ్మా నాన్నా వున్నారనుకుందా చచ్చేరనుకుందా?"

"ఆఁ.. వున్నాం ఎందుకే?.... గుడ్డి కన్నుంటే యెంత లేకపోతే యెంత?.... ఏదిగొచ్చింది. ఎమ్మే పేసయింది. చూస్తూ ఏం చేసేం దానికి!....మనం వున్నా ఒకటే చచ్చినా ఒకటే.... ప్రయోజకురాలైంది.... జతగాణ్ణి చూసుకుంది....ఏం చేసిందే! ఎందుకే అలా వురెట్టుకు చస్తావూ?" అని అభిమానంగా నవ్వుతూ, పైమీద గావంచాతో కళ్ళొత్తుకున్నాడు కామేశం.

"అయ్యో అయ్యో....అసలు సంజవేళ ఆ కంట తడేవిఁటండీ?.... ఆ విశ్వాసఘాతకురాలి మాట తెచ్చి మీ మనసు పాడు చేసేను పాపిష్టిదాన్ని....అంతా నా ఖర్మ-" అని నొచ్చుకుంది యుల్లాలు.

"అమ్మోయ్!.... మజ్జిగ పొయ్యవే" అంటూ వంటింట్లోంచి కూతురు పొలికేక పెట్టింది.

"వస్తున్నానే అమ్మా....తల్లీ మహరాణీ ఆ బొబ్బలేవిఁటీ....చూరు నీళ్ళేగా....బుల్లి పాపాయివా పోసుకోలేవూ?.... వడ్డించాలిగావును" అంటూ పైటచెంగుతో కళ్ళు తుడుచుకుంటూ లోపలికి వెళిపోయిందా అభాగ్యురాలు.

ఆరుబయట నులకమంచంమీద మేను వాల్చి మీన మేషాలు లెక్కబెడుతున్నాడు బడిపంతులు కామేశం, చుక్కచంద్రుడి పక్కలో చేరుతుంది.... ఉబికి ఉబికి సముద్రం ఆకాశం ముద్దుకోసం ఎగిరిపడుతుంది. వెన్నెని కౌగిలికోసం, తియ్యని ముద్దుకోసం లోకం అణువణువునా ఆరాటపడి పరవశించిపోతుంది. ఈడొచ్చిన పిల్ల జోడీని వెదుక్కోదా? వచ్చే యేడు రిటైర్‌మెంటు. బోడి మూడువేలు యే మూలకొస్తుంది? దేనికి పనికొస్తుంది? బత్తెం చూస్తే యాభైరూపాయల పెన్షన్. కొంపచూస్తే పీకలమొయ్యా అప్పుల్లో మునిగి ములములాగ్గా తేలుతోంది.... చదువుకున్నది మరి.... కళ్ళారా చూస్తూ ఏం చేస్తుంది? వెలుగుండగానే యిల్లు చక్కబెట్టుకుంది. స్వతంత్రించి చెర విడిపించుకుంది....యింతకన్న మరోలా ఏ కూతురు మాత్రం తండ్రి ఋణం తీర్చుకోగలదు? ఎవర్నని ఏం ప్రయోజనం?— అంతా రోజులమహిమ....కట్నాలూ కానుకలూ పోసి ఖరీదు గడితే వివాహం అపవిత్రమైపోయి అసురమైపోతుందని నల్లపూసలూ, మట్టె, మంగళసూత్రం అవే చాలు పదివేలు అనుకుని....కన్యాం కనక సంపన్నాం అంటూ కాళ్ళుకడిగి కన్నెధార బోసేవారు....ఇంత దారుణమా?! స్కూలు ఫైనలు ముమ్మారు మొగ్గలేసిన పప్పుముద్ద గాడికీ పదివేలు కట్నం కావాలి. పెళ్ళాం చదువుకున్నదవాలి, సంపాదించాలి, మొగుడి చేతుల్లో బిళ్ళగుడుపుల్లా ధారపొయ్యాలి. కట్నాలకి కట్నాలూ చదువులకి చదువులూ యెక్కడనుంచొస్తాయి?....కోట్లకి పడగలెత్తే కలవాళ్ళా బాగున్నారు, పూట బత్తెం పుడక లెరువూగాళ్ళా బాగున్నారు - వాళ్ళకేం నిక్షేపంలా నిమ్మకి నీరెత్తినట్టున్నారు హాయిరంగా మంటూ .... ఎటొచ్చీ యీ కులాలూ గోత్రాలూ కట్నాలూ కానుకలూ బాదరబందీలూ అన్నీ మనకే. గోచికి పెద్దా గావంచాకి చిన్నా .... యిదీ బతుకులు ... రామచంద్రా!....ఎవడితో చెప్పుకోం? బురద పాముల్లాగ అడుక్కి పోలేం పైకి రాలేం. సంసారంలో కూరుకుపోతున్నాం- మర్యాదలూ సాంప్రదాయాలూ వల్లకాడూ వశినపత్రా అన్నీ మనకే .... మింగడానికి మెతుకు లేకపోయినా సంపెంగ నూనె ఘుమఘుమలు కావాలి ... యిహ యీ బతుకులింతే మరి - ఏదో చొరవచేసి పిల్ల ఓ యింటిదైంది - పదికాలాలపాటు వాళ్ళు పచ్చగా వుంటే అదే చాలు .... చల్లగా చూడు భగవంతుడా! నిన్న మొన్నటిదాకా నా అల్లుడిమీదకే కూతుర్ని వుసిగొలిపేడు పక్కింటి హెడ్‌గుమాస్తాగాడు .... అదో మెల్లకన్ను మోహనాంగి — ఇప్పుడా కుర్రాడు నా కూతుర్ని చేసుకున్నాడని కడుపుమండి చస్తున్నాడు....కుళ్ళు దగ్గులూ

వాడూను - వెధవ వాళ్ళద్దరి మద్య యేవి పెట్టడుగదా....వెధవల కేంటి? ఎంతకేనా తెగిస్తారు తక్కువ జాతి వెధవలు.కాలం మారిపోయింది. పెళ్ళాం ఉండగనే పిల్లనిస్తావని ముందు కొస్తున్నారు. పచ్చని కాపురాల్లో చిచ్చులుపెట్టి పిల్లల్ని తారుస్తున్నారు - నా కూతురి కాపరం సంగలో కలవకుండా కటాక్షించు మహాప్రభో!.... అనాధజీవ్రలం - హాయా మర్మం లేని కునికి నక్కని నా నెత్తిమీద ఆటీపండు పడకుండా రక్షించు రక్షించు - ఆరగాని వెధవాయి లంపహా కుర్చీలెక్కి అ మనింటి వాళ్ళ నందరినీ అధః పాతాళానికి అణగ దొక్కేస్తున్నారు. ధనవంతుడు కబ్బిచ్చి దేవుణ్ణి కొనిపారేస్తున్నాడు, కలివాడు తన్ని అవతల కీడ్చి పారేస్తున్నాడు పెద్దాలేదు చిన్నాలేదు. న్యాయంలేదు ధర్మంలేదు- అంతా కలగా పులగం, వరసంకరమై పోయింది - రోజులు మండిపోతున్నాయి, లోకం పాపసంకిలమై పోతోంది. నాదేవికి ఒళ్ళు మండాలి, అప్పుడప్పుడు ఆవిడ జలపరిస్తుందట - ఆవలించి అప్పడాల్లా నలిపి పారెయ్యాలి వెధవల్ని - భూవిం దడదరిల్లాలి తప్పదు - ధర్మ సంస్థాపన జరిగి తీరుతుంది. హెడ్డు గుమాస్తాగాడూ గాడిద గుడ్డుగాడూ, వాడి రేచీకటి కూతురూ అందరూ హతమారి పోవాలి - న్యాయం విలబడాలి ధర్మం జయించాలి తప్పదు తప్పదు" అనుకుంటూ లోకకళ్యాణాన్ని వాంఛిస్తున్నాడు బడిపంతులు కామేశం,

అకస్మాత్తుగా తిరగబడి జారిన రాళ్ళ గుట్టలా బుడబుడలూ గుడగుడలూ కలిసి చెల్లాచెదురై చెలరేగిన కందిరీగల పట్టలా జంయ్ జంయ్ మంటూ చప్పుడు దగ్గర పడుతోంది. పీనుగ వెళ్ళబోతున్నట్టు వీధిలో కుక్కలు కుయ్యోమంటూ హృదయ విదారకంగా భీతిని రెచ్చగొడుతూ ఏడుపులు మొదలు పెట్టేయి.

"ఎవడో అదృష్టవంతుడు వెళ్ళిపోతున్నాడు - వెళ్ళు బాబూ వెళ్ళు సుఖం - బతికుండేం బావుకుంటావు - వెళ్ళిరా" అనుకుని పక్కకి ఒత్తిగిల్లేడు.

కళ్ళు తిరిగేయి. నులకమంచం పక్కకి ఒరిగింది, కిందకి దొర్లిపోయి అ చేత్తో ఆదుకుని లేచి కూర్చున్నాడు, కాలికింద నేల కదుల్తోంది,

"పైత్యం బాగా తలకెక్కిందేవ్.... ఒళ్ళు జోగుతోంది-యీ వెధవ గవర్నమెంటు గుడ్డికళ్ళ బియ్యం పీక్కాను.... ఏం కలిపేస్తున్నారో ఏం తినేస్తున్నావో యేవో!- మన ఖర్మ" అని తల గొట్టుకుంటూ.

"ఇదిగో ఏవేవ్....విన్నే....ఓ అల్లం ముక్కా జీలకర్రా యిలా తగలెయ్... కళ్ళు తిరుగుతున్నాయి" అంటూ తూలిపోయేడు కామేశం.

• • •

సరిగ్గా అదే సమయంలో- ఆ క్షణంలో "తంగ్రీ రావయతంగ్రీ!.... మహాన్నబావా!- యీ యీదికి ఆ కొసన గుడిలో కొలువు తీర్తన్నవునువ్వు—యీ కొసన సారాకొట్లో కొలువుసేస్తన్నను నేను-పట్టుపట్టీసి సెమ్మటూడిపోయి గుడి పాడడిపోనా- గుడ్లగూబ కనబడదంట- అప్పలమ్మ అను వెట్టనన్నా బొక్కనాగ యీ సారా కొట్టు యిడిసిపెట్టలేదీ రావులుగోడు- కానోల్లు నప్పలకి నప్పలు మింగేస్తన్నరు- మాలాటోల్ని మంగలంలోయెట్టి మాడ్చేస్తన్నరు- బీరా బిక్కీ సచ్చిపోతన్నరు- నీ ముందల సంతరాలు సదుగుతాడే ఆళ్లాడు మా సెత్తొడు-మారీసుడు- మాయలమారోడు- అడు నీతో మడిసి గురించి నిజం సెప్పడు - సక్కరపొంగలీ పులియారా పెద్దోలింటికి అట్టుకెల్లి ఆల్లసేవలు తెగకారికేస్తడు- ఒకటే గుసగుసలు- ఏటో రాసకార్యాలు — రాబందులగోస - ఆడూ ఆల్లూ ఒకటి- మా సెడ్డకానోల్లు - ఆల్లమాటినబోకు - ఒక్కపాలి కల్లు తెర్సి సూడు బాబూ - నీ రాజ్జిం ఎలా బుగ్గయిపోనాదో సూడు - సూడు నువ్వే సూడు రావయబాబూ" అంటూ సారాగ్లాసు పట్టుకుని తారకంగో పడ్డాడు మెకానిక్కు రావులు

"ఓకొల్లకోసి తాగుబోతు సచ్చినోడా" అంది సారాకొట్టు ప్రొప్రొయిటరు అప్పలమ్మ, కుండలో సారా కలగదోస్తూ.

"కవాప్పుందుకోయే అప్పలూ" అన్నాడు రావులు సారాగ్లాసు పక్కకి బెడుతూ.

"పుల్లమీద పెయ్యేస్తే మండలిరగ్గొడతాను- మూన్నాల్లయింది అబ్బనంగా తాగుతున్నవు-డబ్బులు కక్కి మరీ ఒట్టుకెల్లు - తాగిందిదమ్మిడీ - తెగవాగుతున్నడు."

"నిన్నా నన్నా కప్పెట్టన్నన్నయ్ ఏటి సేసుకుంటవే-పోనేయే బాతుగుడ్డే నా బంగాలి దుంపేనా యెట్టే" అని గభాల్నగుడ్డు అందుకున్నాడు.

"దోపిడీకి దిగినావేట్రా దగుల్బాజీ సచ్చినోడా!" అని గుడ్డు లాక్కోబోయింది అప్పలమ్మ

"దోపిడీయా?- యిదేం దోపిడీయే ఎర్రిముండా గోలా!" అంటూ ఒడుపుగా అప్పలమ్మ చేతి విసురుని తప్పించుకుని గుడ్డు నోట్లో కుక్కేసుకున్నాడు,

ఓస్నీజిమ్మడిపోనూ- జిత్తులమారోడా- గుంటనక్కలాగ సూపూనువ్వూను- నువ్వు సేసిందేట్రామరి దోపిడీకాక ?"

"రాసులు రాసులు కూడు పోసుంటే- పిడికెడందుకున్నాను- దోపిడీయంటే పాపిష్టిదానా- అది దోసుకోడమా? ఒవురు సెప్పినారే నీకు? దోపిడీకాదే పంచుకోడమంటరు తెల్సుకో ఎర్రిమొకమా!"

"ఓలమ్మోలమ్మో - సూసినావా సూసినారా - నీ తాతగోరి సొమ్మా బాబుగోరి సొమ్మురా పంచుకోడానికీ? - యిది నా కష్టార్జితంరా బొంకిలీ సెదవా!" అని గుండెలు బాదుకుంది అప్పలమ్మ.

"లోకంలో సొత్తంతా ఒవుడిబాబుగోరి సొమ్మే? - మనందరిదీని - తీరిగ్గా పంచుకుని తినండోరె అని బగుమంతుడిస్తే - దక్కిన కాటికి ఎవుడి మట్టుకాడు కబలించీసి మనలాటి ఎర్రిమాలోకాలకి ఎగనావం లెట్టేస్తన్నరు."

హమ్మోహమ్మో! - పట్టపగలే ఇంత నిబ్బరంగా పేల్తన్నడెదవ - గజిదొంగ! సూస్తారేటయ్యా పెద్దమడుసులు? ఆడకూతుర్నిసేసి అన్నేయం సేస్తంటే" అని అందర్నీ లేవగొట్టింది అప్పలమ్మ,

"గిలాసేనా వుచ్చుకోనేదు - అప్పుడే అంత కైపెక్కి పోనాపేంటా రావుఁ లన్నా! .... ఆడకూతురు తెలిపోతుంది ఒల్లకోరా" అన్నాడు తోటి మెగానిక్కు.

"నిజం సెబితే - దోసుకో ంవంట్రా?- యివరంగా సెబుతాను యినుకోండ్రోరి ఎర్రిగొల్లోల్లూ"

"అట్టేపేలేవంటే జెల్లకొసిగలవారే రావుఁలుగోయ్."

ఉగ్రుడై పోయేడు రావుఁల,

"ఏ ఎదవేనా ముందికి దిగాడా అంటే తాటి పుచ్చిలాగ సెటాపటా బుర్రకాయి లెగిరిపోతయి. సెప్పింది సచ్చినట్టిను కోండి....కంయి కుంయిమనారా తోలొలి స్తేసను -ఉకుకురకతం మడుపలు కడద్ది- కబడ్దార్!" అని పేంటు జేబులోంచి రెంచి తీసి బాకులాదూసి పులిలా ముందకి ఉరక బోయేడు.

తాగుతున్న గ్లాసులు వదిలేసి నోళ్ళలో గుక్కలు మింగలేక పుక్కిబట్టి హడిలి పోయి బల్లులా గోడలకి అంటుకుపోయేరు కొట్లో జనవంతా. బిక్క చచ్చిపోయి గుడ్లు మిటకరిస్తోంది అప్పలమ్మ.

"బయపడకండెహె పిరికి సన్నాసులు - యినండ్రా" అంటూ టేబిలుమీద నిల్చుని రెంచి వూపుకుంటూ ప్రారంభించేడు రావుఁలు.

"ఆ మద్దిన పెద్ద పెద్ద సఁగులు సదిగి నోల్లు - బడిపంతుల్లు పీడరు ఏసంబిలీ మెంబరీలు - ఎవురెవురెవురో సాలామంది దొచ్చినారు మన గుడిసిల్లో! ఊనియన్లో కీని....ఏటి సెప్పినారాల్లంతా యిన్నారా? కునికిపాట్లడినారా మొద్దుమొకాలు! - యీ బూ పెపంచికంలోదంతా అందరిదీనీ - అందరం పంచుకోవాలి, ఈ కాలివీ - యీ మిలూ - యీ వర్కసాపూ - యీ కంపెనీలూ ఎక్కడ నుండూడద్ద యిరా? యినువుఁ! అది బూదేవతిచ్చినాది- మన సావుకార్లు తాతల్నాటింంచి అందిన కాడికి సక్కబెట్టుకుంటన్నర....పూ పెక్కి పోయున్నరు - ఆల్లకేటి . ఒక సేటి ఎయ్యి మిల్లులు కడతరు."

"ఆడికుంది. ఆడు కట్టుకుంటడు. మద్దిన నీకేంరా?"

"ఆడికుందా? ఏటుంది? ఎక్కడుంది?- ఆడిదంతా మనదే. మొట్ట మొదాట సేసిక్కించుకున్నరాల్లు - మనోల్లు దద్దమ్మ ల్లాగ నోరెల్ల బెట్టుకూక్కసున్నరు."

"ఏటో ఎదవగోల గత్తిరి బిత్తిరి - మన కెందుకోరే - బోనస్సులూ కూలి డబ్బులూ కానీపరకా కలిసొస్తే సూడు - నేకపోతే ఎందికహే యీ కాకిగోల?"

"అలాగనే మట్టిబుక్కడాల్లాగ కూకుని బతుకు ల్నిదారికి తెచ్చుకున్నాం - రేత్రనక ఎండనక వాననక అగ్గిలో బుగ్గితో మాడి మసైపోయి - సెక్రాలుతిప్పి సుత్తిలేసి కండలు కరగ్గొడితే - ఆల్లకి యవ్వారాలు సాగుతున్నయి - కాసురాల్తన్నయి."

"ఆడి పెట్టుబడో? - జీతాలూ నాతాలూ?"

"మన కండలూ సెవఁటా పెట్టుబడి కాదంట్రా బుర్రలేనోడా? - జీతాలూ నాతాలూ ఏపాట్రా? - పిసరంత - నాబాలాడికీ కూలిడబ్బులు మనకీ - ఏటీ అన్నేయిం?"

"ఆడి నస్టాలో?"

"నస్టాలా! - ఆడికి నస్టఁవెందు కొస్త దిరా మతిమాలోన్డా - గవుర్మెంటోరికి పన్ను లెగ్గొట్టడానికి బనాయించిన మాయి నెక్కయిగాని నిజం నెక్కలంట్రా - నిజంగా నస్టఁవే వస్తంటేయింకా యెందికా యవ్వారాల్ని పట్టుకేలాడ తన్నరు? ఆడికి తోసక నీ మీద జాలా?"

"అంతేసంటావా, రావుఁలన్నా?!"

"ఇయమ్మాటికీ అంతేరా-ఆడికి సెంటూ మనకి సెవఁట - ఆల్లకి సలవగదీ - ఏడిగదీ - ఒడ్డుపుగదీ పడుపుగదీ - ఒకసేటి కాలికోగదీ ఏలుకోగదీ - లంకంత బంగలాలు - సివంగిల్లాటి సీవఁకుక్కలు - ఘన కేటుంది? కల్లు కాలవలూ కుక్కిమంచాలూ సొమ్ముల పాకలు - దాగఁవేసి నప్పుడల్లా యిస్కి- జిన్నూ మంచినీల్లలాగ వుచ్చు కుంటడాడు - మనకి నోరారుసుకుపోనా గెంజినీల్లకి టికానానేదు."

"ఏటి మారగం?"

"మనకీ నాబాలు పంచాల."

"పంచడాడు - సూస్తా సేతులారా ఒగ్గీసుకుంటాడా?"

"సెక్కరాలు మన సేతులున్నయిరా బుల్లోడా - ఆడూ ఆడిబాబూ పంచాల"

"మిల్లు గుమ్మ సెక్కినావంటే మక్కలిరగతంతడాడు - అప్పుడేటి సెయ్య గలవూ?"

"ఆడెవడ్రా తన్నడానికి? - మన సొత్తు మనం సోదీనం సేసుకుంటం - బూదేవత దద్దరిల్లిపోద్ది - మిషన్లు మన సేతికి సిక్కాల- దరిద్దరం తీరిపోవాల."

"ఎలాగరా?"

"కండలూ నోల్లూ సాలవంట్రా - రామదండు లేసిందంటే ఆడి తరవాఁ ఆడి బాబుగోడి తరఁవా ఆపడానికి? గునపాలూ గెడ్డపారలూ సేతుల్లో అట్టుకుని ముందికి దూకాలేకాని - బూదేవతకి సలుడు కురాదూ? సవందరాలు ఆర్సుకుపోవూ?.... ఏరాడకొండ పిండయిపోదూ? లెగండి లెగండోరె నిదరపోతుమొకాలు!" అని హుంకరించి టేబిలుమీద నుండి కిందకి దూకేడు రావుఁలు.

అందరూ పిల్లులైపోయి వీధిగుమ్మం వేపు తెల్లబోయి చూస్తున్నారు.

రానియ్ రానియ్ అప్పలమ్మా డూటీకి టైమయిపోనాదే" అంటూ టోపీ సద్దు కుంటూ లాఠీ ఆడించుకుంటూ కొట్లో అడుగుపెట్టేడు పోలీసు జవాను.

"సుక్కేసుకోరేటి జవానుగోరు?" అంటూ సారాగ్లాసు అందించింది అప్పలమ్మ.

"సెస్సె డూటీలో వున్నాను - కొంప ములిగిపోద్ది - ఏటో మొగమాట వెడతున్నవు- పోనీ గిలాసు కోసఁగవెయ్యి సాలు - ముందు లెక్కతియ్యి- జల్దీ జల్దీ- స్టేషన్‌కి ఎలిపోవాల దొరగారొస్తారంట" అంటూ మొక్కుబడికి తాగినట్టు, తగుమాత్రం రుచిమూసి నోట్లు లెక్కపెట్టు కుంటూ వెళిపోయేడా పోలీసు జవాను.

పకపక్కమని నవ్వేడు రావుఁలు. తెల్ల మొహాలువేసి అందరూ రావుఁలువేపు తిరిగేరు?

"సూసినారంట్రా ఎదవసన్నాసులూ?- అరనాకి అమవెట్టదు అప్పలమ్మగోరు - పోలీసోడిని సూసేసరికి దన్నాలెట్టి మరీ సదివించుకుంది- అంతేరా- తంతానన్నోడికే దాసోహఁవంటారు" అన్నాడు.

"అన్నేయం అన్నేయం"

"నాయిం అన్నేయిం!- ఎక్కడున్న

యిరా యియ్యన్ని - కంటపోస . గవురు మెంచే సానికొంపలమీదా సా ' పాకల మీదా నిలబడినాది - యింత నేరమా?- పాపం పండిపోనాది- పిటపిటలాడి కుల్లిపోనాది - మిషన్లు మనసేత సిక్కాల అల్లవనాలు పడిపోవాల- ఎన్నాల్లు సాగుతాదీ. దురమారగం?-బూదేవత బరించ నేదింక - ఆయమ్మ కన్నెర్రసేసి నాదారం సేసే - సూసొక్క వా రాజా ఈ మిల్లులు , మిసన్లూ యజిమాన్లూ - గోవిందా గో-విందా"

"గోవిందా"

"అప్పలమ్మ సారా బడ్డీ - పాత బాకీలా-"

"గోవిందా గో....విందా" అంటూ గగ్గోలు పెడుతూ సారా గ్లాసులు, మరో చేత్తో వగం వగం కొరికినక ప్పల్లలూ పైకెత్తి తన్మయంలో చిందులు తొక్కేరందరూ.

"వున్నోల్లంతా వూబిలో కూరుకుపోవాల - ఆల్లుమట్టి కరుసుకపోవాల - మిసన్లు మనకి సిక్కాల - కూలిండి అడగు పడితే దరణి బూదేవి దద్దరిల్లిపోవాల-పగుల్లేసి ముక్కలు చెక్కలైపోయి పోవాల - లెగండ్రా లెగండి - మిల్లూ కంపెనీ జోరీవం సేసుకుందం లెగండి- పదండోరె పదండి - ఎయిరా ముందడుగు అని నేల మీద ఒక్క తాపుతన్నేడు రావులు.

సారా బడ్డీ గజగజలాడిపోయింది. గ్లాసులూ చెంబులూ ఒక దానిమీద మరొకటి తూగి తాగినట్టు గణగణ మోగడం మొదలెట్టెయి. ఒకరిమీదొకరు తూలిపోయి చేతులతోనూ భుజాలతోనూ పొదుకుని కాసుకున్నారు. కైపులో ఒళ్ళు తెలియనట్టు వున్నారంతరూ

"ఇదేటీ సోద్దెంవూ! ఉత్తిమ లినే గిలాసులాడిపోతున్నయీ!" అని నిస్వేరబోయి చూస్తోంది అప్పలమ్మ.

"ఒక్క తాపుకే ఒణికిపోయింది సారా బడ్డీ! - రావులుగోడి కెంత బలంవో!" అని ఆశ్చర్యబోయే డొకడు.

"అదేరా నాకూ యిసిత్తరంగావుందీ! అంటూ బిత్తరపోయేడు రావులు.

ఒక్కమారు పీధిలో గొల్లుమని విని పించింది. బడ్డీలో వాళ్ళంతా పీధిలోకివచ్చి చూసేరు.

పొగ క్రక్కి పొంగెత్తిన గంధకద్రావం కాగిన చప్పుడు చెవుల్లో గుంయ్ గుంయ్ మంది. దడదడమని బాంబరు విమానాలు మీదనుంచి ఎగిరి దాటిపోయినట్టయింది. చెట్లమీద కునుకుతున్న కాకులు తుపాకీ దెబ్బకి చెదిరినట్టు చెల్లాచెదురైపోయి రెప రెపలాడుతూ ఆర్తనాదాలు చేస్తూ చెట్ల చుట్టూ తెగతిరిగేయి

కుదరంలోంచి కదిలిపోయి భద్రగిరి రామయ్య ఉలిక్కిపడ్డాడు. హిరణ్యకశిపుడు మళ్ళీ బతికి దండెత్తలేదుగదా అని కంగారుపడ్డాడు సింహాద్రప్పన్న. రెండు మూడు నిమిషాలు భూమి కంపించింది. పిచ్చెక్కి చెలరేగిన మదపు ఏనుగుల మందలా తొడతొక్కిడిగా ఒకదానిమీదొకటి రగబడి కెరటాలు విరగబడి పోతున్నాయి. అల్లకల్లోలమైపోయి చెలియలకట్టదాటి పీధినబడింది పోటెత్తిన కృద్ధసముద్రం. తెరలు తెరలుగా తరంగాలు తరంగాలుగా పీధినబడింది భీతిల్లిన జనసముద్రం. ఒడ్డునపడ్డ పరిగ, వంజరం, సొరచేపా వూపిరాడక తన్నుకుంటున్నాయి. పీధినబడ్డ రావులూ, కామేశం, రామనాధం పిల్లులైపోయి గజగజలాడిపోతున్నారు. మూలమూలల నక్కుతున్నారు.

విలయ సముద్రం వికటఘోష - మహా జనసముద్రం ప్రళయ ఘోష.

"భూకంపం భూకంపం - బాబోయ్ - మనుషులం-మానవమాత్రులం ఏం చెయ్యగలం? - ఏం దారి దేవుడో?"

"ఇళ్ళు వాకిళ్ళు కూలిపోతే! .... వూరుకి వూరే కూరుకుపోతే!"

"బతికుంటే సాలు సాలు బలుసాకు తిని బతకొచ్చు."

"కుటుంబాలు - మా బుల్లిపాప - బుజ్జిగాడు - నిర్వంశం నిర్వంశం"

"బతికి బయటపడితే...."

"ఈ గండం గడిస్తే - కనకమాలచ్చిం తల్లీ - అమ్మా తల్లీ కాపాడుతల్లీ"

ఒక్క కుదుపుతో - ఆ క్షణంలో మనుషులమధ్య పధకాలూ, పన్నాగాలూ, అసూయలూ ద్వేషాలూ, రోషాలూ ఆవేశాలూ పరహింసా పరవిత్త హరణాభావాలూ - హరించిపోయిన హారతికర్పూరంలా, చెల్లాచెదురై ఎగిరిపోయిన చెట్లమీద పక్షుల్లాగ సమసిపోయి, అణగారిపోయి పటాపంచలైపోయేయి.

కంటిముందు కరుడుగట్టిన నిజం అనుకున్న కాలికింద నేల తరిగి కరిగి కోరుకుపోతోంది- బతికుంటామా బలైపోతామా అన్న భయం ముంచుకొస్తోంది.

ప్రాణం- విలువైన ప్రాణం- తియ్యని ప్రాణం

చావు-బతుకు- భూస్థాపితం- సజీవ సమాధి

కోరలుసాచి పంజావిప్పి గాండ్రించే భయంకర మృత్యువు

ఆవులిస్తున్న సర్వనాశనం- ఆర్తనాదాలు హాహాకారాలు.

అంతా జన సందోహం- మనుషుల కోలాహలం,

కనుచూపుమేర బిల బిల మంటూ మనుషులు- తపతపలాడుతూ మనుషులు - రెప రెప లాడుతూ మనుషులు- రాబందుల గుంపులు, మిడతల దండులు, కొంగల బారులు- మనుషులు మనుషులు పీధినిండా, వూరునిండా కులకులమంటూ మనుషులు.

లోకమంతా మనుషుల మయం- జలదరించి కంపించిన ధరాతలంమీద దద్దరిల్లిన మానవ సమూహం- వావీ వరసా, కులం గోత్రం, సంప్రదాయం సంస్కారం, వర్గం తరహా అన్నీ మరిచిపోయిన కలగా పులగం అయిపోయిన కలగూరగంప - మనుషుల గుంపు.

మానవ సమాజం □□□

